
6

# నాయర్ నవ బుక్కులు



# బల్లచెక్క

వి.పి.బి.నాయర్ అయ్.పి.ఎస్.


హనుమంతరావు పెళ్లయి పదిహేను సంవత్సరాలు దాటినా—

ఆ దంపతులు నేర్చుకున్న ముప్ఫయిమూడు మెళుకువలు ప్రయోగించినా, స్త్రీలింగ, పుల్లింగ, శివలింగ రకాలకు చెందిన అందరు దేవతలకు, పూజలూ, లంచములు అర్పించినా, అలోపతి, హోమియోపతి, నేచరోపతి, తిరుపతి అనే సిస్టములు స్వీకరించినా రుగ్వేదం నుండి ఆయుర్వేదంవరకూ వున్న సర్వ వైద్య పద్ధతులూ అవలంభించినా, అధర్మవేదం కూడా అంగీకరించడానికి అనుకున్నా, యోని పొంతనగల ఆ దంపతులు యునానీ వైద్యంతో కొంత పొంతన చేసి చూసినా వాళ్లు రెండు చిన్నారి పాదాలు చూసుకునే అదృష్టానికి నోచుకోలేదు.

చివరకు వాళ్లు అమెరికా సందర్శించి ఏమేమో చికిత్సలు పొంది ఆరేడు నెలల తరువాత అంజమ్మ గర్భిణిగా, హనుమంతరావు ఒక చిన్న పొట్టకి యజమానిగా తిరిగి వచ్చారు.

హనుమంతరావు ఉబ్బిన పొట్ట చూసి అంజమ్మ గర్భానికీ, ఇతని కడుపు ఒక స్టెప్నీగా వర్తిస్తుందేమో నని కొంతమందికి అనుమానం కలుగవచ్చు. అద్దెకు గర్భకోశము దొరుకుతున్న పద్ధతి అమెరికాలో వుందని విని వుంటారు. కానీ అక్కడ మాత్రం మగవాళ్లకు గర్భాశయం వుంటుందా? వుండొచ్చే మో! ఎందుకంటే ఇక్కడ పగలైనప్పుడు అక్కడ రాత్రి. అందుకే ఇక్కడ స్త్రీకి జరిగేది ఏమైనా అక్కడ పురుషులకు జరుగుతుందేమో?

ఏమైనా "అనుదినం పోషణ ఇవ్వడంవల్ల, అది అతి తొందరగా పెరిగి వచ్చింది" అని అన్నట్టు ప్రత్యేకంగా విశేషమైన శుశ్రూష చేయకుండానే అంజమ్మ కడుపు మామూలు గర్భిణీ స్త్రీల కడుపుకంటే కొంచెం పెద్దదిగా తయారయ్యింది. ప్రసవానికి కొన్నిరోజుల ముందే ప్రసవ డాక్టరు ప్రవచించాడు. -కవలపిల్లల్ని ప్రసవిస్తుందని. డాక్టర్ చెప్పిన తరువాత రోగి వ్యతిరేకింపగలదా? అంజమ్మ రోగి కాకపోయినా డాక్టర్ చెప్పింది మాత్రం త్రికరణశుద్ధిగా అంటే మనసా, వాచా, కర్మణా ఆచరిస్తూ కవలపిల్లల్నే ప్రసవించేసింది. డాక్టర్ సంతోషించాడు. హనుమంతరావుకు స్వర్గం లభించి నట్టయింది. అంజమ్మకు తన జన్మ సఫలమైనట్లయి ంది. ఊరివాళ్లకు అమెరికా మందులపై వున్న నమ్మకం పదిరెట్లయింది. ఇద్దరు పిల్లలూ అమ్మా యిలై వుండీ, తన ఆనందదీప్తికి కొంచెం మసక కలిగి వుండేదేమోనని హనుమంతరావుకి తెలుసు. కానీ ఇద్దరూ మగబిడ్డలే కలగడంవల్ల అతని సంతోషానికి పరిమాణాము నిర్ణయించడం అసాధ్యం. ఆ పసిబిడ్డల్ని అతను మొదట పరిశీలించింది ఏమిటంటే—అమెరికా మందు సేవించడంవల్ల గర్భం కలిగిందనే కారణంతో వాళ్లకు నీగ్రో జాతులవారి రంగుగానీ, చిరు వుంగరాల జుట్టుగానీ వచ్చిందేమోనని. అవి రెండూ లేవు అని తేలగానే ఒక నిట్టూర్పు విడిచాడు. మళ్లీ అతను పరిశీలించా డు. దొంగ రంగేమైనా వుందేమోనని. అది కూడా లేదు. పక్కా 'మేడ్ ఇన్ ఇండియా' లాగా వున్నట్టు అతనికి దృఢ నమ్మకం కలగగానే తేనెలో పంచదార



కలిపినట్టు అతనికి అతి మధురంగా అనిపించింది. పిల్లలు పెరుగుతూ వుంటే అచ్చం హనుమంతరావులా తయారవుతున్నారు అని తెలిసినప్పుడు స్వాభిమానం ద్విగుణీకృతమయింది. పుట్టుకతోనే గుడ్డివాడైన ఒకడికి శస్త్రచికిత్సానంతరం చూపు వచ్చినప్పుడు ఎంత ఆనందం కలుగుతుందో ఆ విధంగా హనుమంతరావుకు గత పదహారు సంవత్సరాలలో కలిగిన నిరాశ, అతని ఇప్పటి ఆనందానికి అదనపు మెరుగుపెట్టినట్లయింది.

హనుమంతరావుకు అతని తండ్రి ఒక సార్థక నామధేయమే ఇచ్చినాడు. అతని దవడలు మామూలు వాళ్లకంటే పెద్దవీ, కొంచెం ముందుకొచ్చినవి. ముక్కు ఒకరకం వంకాయలాగా వుంటుంది. అతని కళ్ళు, కనుబొమ్మలు కలిపి చూస్తే అతను ఏడుస్తున్నట్లుంది. పెదవులు ఆఫ్రికా భూభాగాన్ని గుర్తుకుతెస్తాయి. అతనికి ఇలాంటి రూప విశేషాలు వుండడంవల్ల పెద్దవాడైన తరువాత అతన్ని వేరేవాళ్లు కోతిముచ్చు అని పిలుస్తారేమోనని భయపడి ఆ బుద్ధిమంతుడైన తండ్రి తన ప్రియపుత్రుడికి హనుమంతరావని పేరు పెట్టడం జరిగింది.

తన తండ్రి తనకు ఒక మహాకోతి పేరు పెట్టాడని హనుమంతరావుకు బాధలేదు. అన్ని కులాలవాళ్లు తమ పిల్లలకు పెట్టే పేర్లన్నీ రాముడు, కృష్ణుడు కావాలని లేదుకదా! రాముని తమ్ముళ్లయిన లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల పేర్లు చాలామంది తమ పిల్లలకూ పెడుతూ వుంటారు. అదంతా సరియేనా, న్యాయమేనా, మంచిదేనా అని ఆ తల్లిదండ్రులు ఆలోచిస్తారో లేదో తెలియదు. లేకపోతే తాగుబోతైన బలరాముడి పేరు, మహాత్మాగాంధిగారి ఈ రాజ్యంలో ఎవరైనా తమ సుపుత్రులకు పెడతారా? లక్ష్మణుడి పేరు పెట్టడం, ఆ అబ్బాయికి మంచిది కాదు. భవిష్యత్తులో ఆ అబ్బాయికి రాబోతున్న అమ్మాయికీ మంచిదికాదు. పదునాలుగు సంవత్సరాలపాటు లక్ష్మణుడు నిద్ర పోలేదనేగదా రామాయణంలో చెప్పింది. ఏ తల్లిదండ్రులయినా స్వంత కొడుక్కి నిద్ర రాకూడదని కోరుతారా? అతని భార్య ఊర్మిళలాగే పధ్నాలుగు సంవత్సరాలూ నిద్రపోవాల్సి వస్తుంది. అలా నిద్రపోవడానికి సిద్ధమైన అమ్మాయి రిప్‌వాన్ వింకిల్‌కు కోడలు కావాలి. లేక కుంభకర్ణుడి చెల్లెలు కావాలి. భరతుడు అని పేరుపెట్టడం మహాపాపం. ఎవరైనా స్వంత కొడుకు చెప్పులనుపెట్టి పూజించాలి అని అనుకుంటారా? సినిమాలో, రాజకీయరంగంలో దిగి అంతగా విజయం సంపాదించలేని ఒక వ్యక్తి ఉదాహరణ వుండడంవల్ల ఎక్కువమంది తల్లిదండ్రులు శత్రుఘ్నుడి పేరు పెట్టడానికి కూడా జంకుతారు. ఆ పేరు పెడితే ఆ పిల్లవాడు పెద్దవాడైన తరువాత కొంతమంది అతన్ని ఆంగ్ల పద్ధతి 'షాట్‌గన్' అని పిలుస్తారేమో!


దశావతారాల పేర్లు పట్టడం సర్వ సాధారణం. మత్స్యావతారం తీసుకుని మత్స్యారావు అని ఆ ప్రథమావతార నామధేయం ఇవ్వడం కాకుండా మీనారావు, మీనయ్య, మీనాశాస్త్రి, మీనా, మీనాక్షి శేషాద్రిలాంటి పేర్లు పెడుతూ వుంటారు. కూర్మావతారం పేరు కూడా వదలడంలేదు. కూర్మావతారం అనే పేర్లు పెడుతుంటారు. కూర్మయ్యశర్మ, కూర్మినాయుడు, శ్రీకూర్మం, కూర్మన్న, కూర్మమ్మ అలాంటి పేర్లు కూడా కొన్ని జిల్లాల్లో చాలా ఇష్టంగా పెడతారు. వరహావతారం పేరు కూడా తక్కువకాదు. వరహాలు, వరాహమిహిరుడు అనే పేర్లే కాకుండా వరహాగిరి అని మొదలుపెట్టే పేరు మనందరికీ సుపరిచితమే. నరసింహావతారం సరేసరి. ఎక్కడ చూసినా ఆ పేర్లే. వామనావతారం నుండి తరువాత అవతారాలన్నీ పూర్తి మానవాకృతి కలిగి వుండడంవల్ల అలాంటి పేర్లు పెట్టడానికి ఎవరికీ ఎలాంటి అభ్యంతరం వుండదు. ఈ కలియుగంలో రావాల్సిన అతి కొత్త అవతారం కల్కి. ఆ పేరు మాత్రం ఇంతవరకూ ఎవ్వరూ పెట్టినట్లు తెలియదు. ఆ అవతారం అవతరించిన తరువాత ఆ నామధేయ అవతారం కూడా రావచ్చేమో.

ఆంధ్రప్రదేశ్‌లో పేరు పెట్టడం అనే ప్రక్రియ చాలా తమాషాగా వుంటుంది. రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్, లాల్‌బహదూర్, సుభాష్ చంద్రబోస్, రవీంద్రనాథ్ టాగూర్, అంబేద్కర్, గాంధీ, నెహ్రూ అని జాతీయ నేతల పేర్లు పెట్టడం పోనీయండి. కెన్నడీ, స్టాలిన్‌బాబు, లెనిన్‌బాబు, మండేలా అనే విదేశీయ నామధేయాలు కూడా మామూలు పల్లెటూరి పిల్లలకు కూడా పెడుతుంటారు. అదంతా తల్లిదండ్రుల జనరల్ నాలెడ్జినిబట్టి వుంటుంది.

హనుమంతరావు ముందు ఇప్పుడున్న ఏకైక ప్రశ్న, తన కవల పిల్లలకు ఏం పేర్లు పెట్టాలి?—అని. పురాణాల్లో వున్న కవలపిల్లల పేర్లు అతను ఆలోచించాడు. లవకుశులని పెడితే తరువాత రోజుల్లో ఆ పిల్లల్ని ఆంగ్లేయరీతిలో 'లెవెన్,

ట్వెల్' అని పిలిస్తే? లేకపోయినా ఆ పేర్లలో ఎలాంటి మసాలా లేనట్టు వున్నాయి. తన పేరే పెడితే? ఒకడికి హన్మంతరావని, ఇంకోడికి ఆంజనేయరావని పెడితే బాగానే వుంటుంది. కానీ ఒకే ఇంట్లో ముగ్గురు హనుమంతరావులుండీ రాముడికి, లక్ష్మణుడికి, సీతకూ కూడా తలా ఒక హనుమంతుడిలా వుంటుంది. అది శ్రీరామచంద్రమూర్తికి పెద్ద దెబ్బకదా. కొన్ని క్రిస్టియన్ కుటుంబాలలో పిల్లలకు తాతల పేర్లు పెడతారు. కానీ హనుమంతరావు తండ్రి పేరు పాపారావు. ఇప్పటి పిల్లలకు అలాంటి పేరు నచ్చకపోవచ్చు. లేకపోయినా పాపారావుకు ఇంకొక కవల పేరు కనిపించడం కష్టం. హనుమంతరావుకు మనసులో తనకు పెట్టిన మహాకోతిలాంటి పేరే పిల్లలకు కూడా పెట్టాలని వుండేది. తరువాత సర్వసాధారణమైన పేరు పెట్టడం కూడా అతనికి ఇష్టంలేదు. పదిరోజుల పరిశోధనానంతరం వాలీసుగ్రీవులనే రామాయణ పాత్రల పేరు ఎన్నుకోబడ్డాయి. హన్మంతరావు భార్యకు కూడా ఆ పేర్లు నచ్చాయిగాని ఈ అబ్బాయిలు పెద్ద యిన తరువాత ఒకే అమ్మాయి కోసం కొట్టుకుంటారేమోనని ఆమెకు సందేహం కలిగింది. తనకు హన్మంతరావు అని పేరు పెట్టినా తోక రాలేదుకదా—అని ఆమె సందేహ నివృత్తి చేసాడు.

నామకరణ మహోత్సవం చాలా ఘనంగా జరిగింది. ఆ కవలపిల్లలు ఎప్పుడూ కలిసే వుంటారు. వాళ్ళ పెరుగుతూ వస్తుంటే ఒక నిముషం కూడా విడిపోయి వుండగా చాలా అసంతోషంగా వుండేది. కానీ అలా విడిపోయి వుండడం అవసరంలేదు. స్నానం చేసేటప్పుడు కూడా కలిసే చేస్తారు. భోజనం కూడా చేస్తారు. చాలా చిన్నప్పుడు కూర్చోడం కూడా తెలియని రోజుల్లో కూ ఆ పిల్లలు పరస్పరం పట్టుకుని కొట్టుకుంటూ వుండేవారు. దోగాడే రోజుల్లో ఇద్దరూ కలిపి దోగాడేవారు. ఏ ఆట వస్తువు కొరకు కూడా వాళ్లిద్దరూ పోట్లాడుకునేవారు కాదు. నడవడం మొదలుపెట్టిన తరువాత ఎప్పుడూ వాలి



## పర్వాలేదు


"ఇంకొంచెం పుచ్చుకోండి సార్
ఫర్వాలేదు"
"ఇంక నావల్ల కాదయ్యా!"
"ఫర్వాలేదు సార్"
"ఇంకా తాగితే ఛస్తావయ్యా"
"ఫర్వాలేదు సార్"

—పి.నాగభూషణం
(అమలాపురం)

ముందు నడుస్తాడు. సుగ్రీవుడు వెనకాలే వుంటాడు. హనుమంతరావు, అతని భార్య ఈ ప్రత్యేకతను చూసి ఆశ్చర్యపడేవారు. ప్రతి విషయంలో పెద్దవాడే ముందుంటాడు. రెండోవాడు రాముడి వెంట లక్ష్మణుడు అనే విధంగా వుండేవాడు.

ఆ ఇంట్లో డైనింగ్ హాల్లో ఒక డైనింగ్ టేబుల్, ఆరు కుర్చీలు వున్నాయి. పిల్లలు కూర్చోడం మొదలుపెట్టినప్పటినుంచి ఆ టేబుల్ పైన కూర్చోబెట్టే భోజనం అంజమ్మే తినిపించేది. ఆమెకు ఆ సమయంలో ఎంతో తృప్తి, ఆనందం, అభిమానం కలిగేది. పిల్లలిద్దరూ మంచిగా భోంచేసేవారు. ఏమిచ్చినా తినేవాళ్ళు. ఎన్ని గ్లాసుల పాలిచ్చినా వాళ్ళు తాగేవాళ్ళు. ఇద్దరూ వీరపాండ్యన్ కట్టబొమ్మన్, రబ్బరు బంతిలా ఎగురుతూ చెంగు చెంగున నడిచేది చూస్తే ఎవరికైనా ఎంతో ముద్దు అనిపిస్తుంది.





## కోటా విశ్వరూపం

కోటా మాటలవాడే అని తీసి పారేసిన వాళ్ళున్నారు ఇండస్ట్రీలో. కానీ చేతలవాడని కోటా తన విశ్వరూపం 'గాయం', 'ఆమె' చిత్రాలద్వారా నిరూపించుకున్నాడు. ఆమె చిత్రాన్ని థియేటర్లో చూస్తున్నప్పుడు కోటా అభినయానికి ప్రేక్షకులు సమ్మోహితులయిపోయారు. థ్రిల్ ఫీలయ్యారు. రియాక్టయ్యారు. కోటా పాత్రలో నటించాడు అనేకంటే జీవించాడు అంటేనే న్యాయంగా వుంటుంది.


—సాయిరాం

పిల్లలకు రెండు సంవత్సరాల వయస్సు వచ్చింది. ఇప్పుడు వాళ్ళ స్వయంగా భోంచేయగలరు. కూర్చోవడం మాత్రం ఆ టేబుల్ పైనే. ఒకరోజు మధ్యాహ్నం వాళ్లిద్దరూ అలా కూర్చుని భోంచేస్తున్నారు. అంజమ్మ ఏదో తీసుకురావడానికి వంటింట్లోకి వెళ్లింది. ఒక ఏడుపువిని వెంటనే ఆమె బల్ల దగ్గరకు పరుగెత్తుకొచ్చింది. సుగ్రీవుడు క్రింద రెండు కుర్చీల మధ్యన పడిపోయి ఏడుస్తున్నాడు. వాలి బల్లపై కూర్చుని సంతోషంతో చప్పట్లు కొడుతూ నవ్వుతున్నాడు. సుగ్రీవుడు పొరపాటున బల్ల అంచునుంచి క్రిందకు పడిపోయాడేమో ఆ తమాషా చూసి వాలి నవ్వుతున్నాడని పాపం అంజమ్మ ఊహించింది. ఏడుస్తున్న బిడ్డను చేతుల్లోకి తీసుకుని వీపు నిమిరి ఎలాంటి దెబ్బలు తగల్లేదని చూసుకుని ముద్దులు పెట్టి సముదాయించి అతడ్ని బల్లపై మళ్లీ కూర్చోబెట్టింది. వంటగదిలో చేస్తున్న పనిని పూర్తి చేయడానికి అంజమ్మ మళ్లీ లోపలికి వెళ్లింది. రెండు నిముషాల లోపల మళ్లీ సుగ్రీవుడి ఏడుపు. ఆమె పరుగెత్తుకుని అక్కడికొస్తే వాలి చప్పట్లు చరుస్తూ బాగా నవ్వుతున్నాడు. అబ్బాయిని చేతుల్లోకి తీసుకుని పాత కార్యక్రమాలే మళ్లీ ఆవర్తించి "ఊరుకో నాయనా ఏడవవద్దు అవునూ మళ్లీ ఎలా పడిపోయావ్" అని అడగ్గా ఏడుపు ఆపకుండా వాలివైపు వేలు చూపించి అన్న అన్న అని చెప్పాడు. వాలి చిలిపి చేష్టలు మొదలుపెట్టాడు అని తెలుసుకున్న అంజమ్మ పెద్దగా నవ్వుతున్న వాలివైపు చెయ్యెత్తి "అయితే నువ్వే తమ్ముడ్ని క్రిందకు తోసేశావా, దెబ్బలు పడాలా? వీడు నీ తమ్ముడేగదా, ఎందుకల్లా చేసావ్?" అని మందలించింది.

మాట్లాడడానికి ప్రయత్నిస్తున్న ఆ చిన్నారి వాలి నవ్వాపేసి "ఈ బల్ల నాది" అని గంభీర ముఖంతో టైబుల్ పైన గట్టిగా చేతితో గుద్దాడు. అంజమ్మకు అసలు విషయం అర్థమైపోయింది.

"కాదు కాదు ఈ బల్ల మీ ఇద్దరిది. ఇతను నీ తమ్ముడేగదా అని చెప్పి సుగ్రీవుడ్ని బల్లపై కూర్చోబెట్టగా వాలి కొంచెం ముందుకొచ్చి సుగ్రీవుడ్ని మళ్లీ తోసేయడానికి ప్రయత్నించాడు. సుగ్రీవుడి కంచాన్ని బల్లపై నుండి క్రిందకి తోసేసాడు. ఇంత జరిగేవరకు అంజమ్మకు బాగా కోపం వచ్చి వాలి తొడపై రెండు ఫటాఫటామని తగిలించింది. కానీ కొంచెం కూడా ఏడ్వకుండా వాలి సుగ్రీవుడ్ని తోసే ప్రయత్నంలోనే వున్నాడు. భయంతో వణుకుతున్న సుగ్రీవుడు క్రిందకు దించమని ఏడ్చాడు. అంజమ్మ సుగ్రీవుడ్ని క్రింద కూర్చోబెట్టి వేరే ఒక కంచంలో భోజనం పెట్టింది.

సాయంత్రం హనుమంతరావు రాగానే పిల్లల



మొదటి దెబ్బలాటను గురించి అంజమ్మ గాబరాగా చెప్పింది.

"అంజూ పసిపిల్లలు ఎప్పటికీ పసిపిల్లలుగానే వుంటారా? వాళ్ళు దెబ్బలాడుకుంటున్నారంటే వాళ్ళు కొంచెం పెరిగారని అర్థం. ఇంతవరకూ వాళ్లకు దెబ్బలాడడం తెలియదు. పట్టి ఏడ్వడమే తెలుసు. దెబ్బలాడ్డం, కొట్లాడ్డం అంతా పెరుగుతున్న వయసుకు లక్షణాలు. అంతేకాదు పిల్లలంతా ఒకేలాగా వుండరు. కవల పిల్లలు అయినా వాళ్ల స్వభావాల్లో కొంత వ్యత్యాసం వుంటుంది. వాలికి ఎందుకో ఆ బల్ల తనదని అనిపించింది. అందుకే అతను సుగ్రీవుడ్ని క్రిందకు తోసాడు. దీంట్లో బాధపడాల్సింది ఏమీలేదు. పిల్లలు ఈ విధంగా పోట్లాడకుండా వుంటేనే మనం బాధపడాలి. పిల్లలు ఒకరినొకరు కొట్టుకోకుండా వుంటే 'కూర అరటిపండు' లాగా వున్నారని దుఃఖించాలి. ఆరోగ్యంగల పిల్లలు దెబ్బలాడాలి. కానీ అది మరీ ఎక్కువ కాకుండా చూడడం మన బాధ్యత. నువ్వొక పని చెయ్. పిల్లలు భోజనం పెట్టేటప్పుడు వాళ్లను బల్లకు అటూ ఇటూ కుర్చీలలో కూర్చోబెట్టు. వాళ్ళ ఎత్తు తక్కువ కాబట్టి కుర్చీలలో ఒక్కొక్క దిండు కూడా పెట్టు. అప్పుడు వాళ్ళు పెద్దవాళ్ళు భోంజేస్తున్నట్లుగా భోంచేస్తారు" అన్న భర్త లెక్చర్ విని అంజమ్మకు కొంచెం ప్రశాంతత లభించింది.

రాత్రి భోజనం పెట్టేటప్పుడు భర్తయొక్క నిర్దేశాలు అంజమ్మ అమలుపరచడానికి ప్రయత్నించింది. సుగ్రీవుడు బుద్ధిగా కుర్చీలో కూర్చుని బల్లపైన కంచంలోంచి భోం చేయడం మొదలుపెట్టాడు. కానీ వాలి తన కంచాన్ని బల్లపైన ఒక ప్రక్కకు తోసేసి ఒక సంక్రసువాడు చేసే అభ్యాసంతో బల్లపై ఎక్కి భోంచేయడం మొదలు పెట్టడం చూసి అంజమ్మకు నవ్వు వచ్చింది. "అబ్బాయి చాలా సమర్థుడే. ఎవరన్నా ఏమాత్రం భయంలేదు. మధ్యాహ్నం అతన్ని కొట్టినా ఏడ్వలేదు. ఇప్పుడు చిన్నవాడు ఒక జెంటిల్‌మన్ లాగే కుర్చీలో కూర్చుని భోంచేస్తున్నాడే. ఇంక వాళ్ళు పోట్లాడకుండా వుంటే చాలు. పిల్లల్ని పడుకోబెట్టి ఆమె భర్తతో ఈ విషయం వివరంగా చెప్పింది.

"ప్రస్తుతానికి ఫర్వాలేదు. కానీ కుర్చీలో కూర్చుని భోంచేసే అలవాటును వాలికి కూడా నేర్పడం తప్పదు. దానికి అంత తొందరేంలేదు. కొద్దిరోజుల్లో అది కూడా నేర్పించాలి. అదంతా నడిచిపోతుంది. వాళ్లింకా చిన్నపిల్లలేకదా. మనం నేర్పించి నట్టుగానే వాళ్ళు పైకొస్తారు. వాళ్ల స్వభావ వికాసానికి మనమే బాధ్యత తీసుకోవాలి" చైల్డ్ సైకాలజీ బాగా అధ్యయనం చేసిన ఒక గొప్ప వ్యక్తిగా ఆయన మాట్లాడడం చూసి అంజమ్మకు భర్తపైన ఎంతో అభిమానం పెరిగింది.

కానీ వాలిని ఆ కుర్చీలో కూర్చోబెట్టే ప్రయత్నం రామాయణంలో అసలైన వాలి రుష్యమూక పర్వతము ఎక్కలేనట్టు కష్టతరమైంది. ఎన్నిసార్లు అతన్ని కుర్చీలో కూర్చోబెట్టినా అతను భోంచేయాలంటే బల్లపైన కూర్చునే చేస్తాడు. అంజమ్మ మంచి చెడూ చెప్ప ప్రయత్నించింది. మందలించింది. కోప్పడింది. కొట్టింది, తొడపాశం పెట్టింది—అయినా ఏమాత్రం ప్రయోజనం కనబడలేదు. సరికదా దానికి విరుద్ధంగా అతని పట్టుదల రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. ఎంత నొప్పి కలిగినా అతను ఏడ్చేవాడుకాదు. కానీ నొప్పి మరీ ఎక్కువ అయితే అతను రెండుమూడు నిముషాలపాటు ఒకరకంగా గర్జిస్తాడు. రెండుమూడుసార్లు అంజమ్మ చేయి పట్టుకుని గాయం కాలేదుగానీ గట్టిగా కొరకడం కూడా జరిగింది. అతనికి ఎక్కువ నొప్పి కలగడంతో అతనిలో సహనశక్తిపోతుంది. అందుకే తల్లిదండ్రులు దగ్గర లేనప్పుడు అతనా నొప్పిని తమ్ముడికి బదిలీ చేసేవాడు. హనుమంతరావు కూడా వీలైనంతవరకు సామ, దాన, భేద, దండోపాయాలన్నీ ప్రయోగించి చూసాడు. కానీ ఫలం శూన్యం. రోజులు అలాగే గడిస్తే ఫరవాలేదు. కానీ రోజురోజుకూ ఆ బల్లపై పోట్లాట పెరుగుతూనే వచ్చింది. మూడు సంవత్సరాల వయస్సురాగానే తమ్ముడు కూడా "నేనేంతక్కువ తిన్నాను" అన్నట్టు తన విశ్వరూపం కూడా చూపడం మొదలుపెట్టాడు. భోజనమప్పుడే కాకుండా మామూలు సమయాల్లో కూడా బల్లపై ఆటలు, పోట్లాటలు సాగించేవారు. సుగ్రీవుడికి వాలితోపాటుగాని లేదా ఒంటరిగాగాని ఆ బల్లపై ఎక్కాలనే పట్టుదల వుండేది. వాలి దానికి అసలు అంగీకరించేవాడు కాదు. ఆ బల్ల 'నాది మాత్రమే' అని వాలి గట్టి అభిప్రాయం. ఇద్దరూ పైకెక్కి యుద్ధం చేస్తూ క్రిందపడేవారు. క్రిందపడ్డాక అక్కడ దొర్లుతూ లేస్తూ అలాగే యుద్ధం సాగించేవారు. యుద్ధం మధ్య వాళ్ళు ఒకరినొకరు కొరుకునేవాళ్లు. అదే అంజమ్మకు, హనుమంతరావుకు ఎక్కువ బాధ కలిగించేది. కానీ ఆ కొరుకుడు గాయాలయ్యేదాకా రాలేదుకదా అని ఒక రకంగా సమాధానపడేవారు. పిల్లలు కొంచెం మెల్లగానే కొరుక్కుంటున్నారు, కావాలంటే వారికి గాయం చేయడానికిగానీ, కొరికి కండ పీకడానికిగాని తగిన దంతశక్తి వాళ్లకు వుందని ఆ తల్లిదండ్రులకు బాగా తెలుసు. నెత్తుర్లు కార్చుకునేదాకా దంతప్రయోగం వాళ్ళు ఎప్పుడు చేసుకుంటారోనని భయపడుతున్న అంజమ్మకు నిద్దర్లో కూడా భయంకర స్వప్నాలు వచ్చేవి. అందరు పిల్లలు మధ్యన ఇలాంటి సంఘటనలు జరుగుతూ వుంటాయి అని చెప్ప హనుమంతరావు ఆమెను ఓదారుస్తూ వుండేవాడు.

పిల్లలకు మూడు సంవత్సరాలు వచ్చిన తరువాత వాళ్లను నర్సరీ స్కూల్లో చేర్చడంవల్ల ఇంట్లో పోట్లాడడానికి వాళ్లకు వీలు తక్కువ అయింది. అంజమ్మకు కూడా కొంచెం సమస్యాధానం



పెళ్లి

"మీరెప్పుడు పెళ్లి చేసుకోబోతున్నారు?" నటి కీర్తిశ్రీని ప్రశ్నించాడు విలేకరి.

"ఛీ! పాడు!! అప్పుడే నాకు పెళ్లేంటి? మా అమ్మకే ఇంకా కాలేదు" సిగ్గుపడుతూ చెప్పింది ఆ నటి.

—వి.ఎల్.వి.భారతి
(దిల్‌సుఖ్‌నగర్)






'హక్కు'

రామానాయుడు స్టూడియోలో తాజ్‌మహల్ చిత్రంలో నటించడం కోసం వచ్చిన జయచిత్ర కనిపించింది. మనిషి దబ్బపండులా కనిపించింది. "మళ్లీ చిత్రాల్లో బిజీ అయ్యానండీ" పలకరింపుగా. ఇంతకాలం పెళ్లి, బిడ్డ. ఈ వ్యామోహంలో ఫీల్డుకి దూరం అయ్యాను. ఇప్పుడు ఆశ తీరింది. పోతే అదిగో రామానాయుడుగారు. ఈ బ్యానర్ ద్వారానే 'సోగ్గాడు' చిత్రం ద్వారా పరిచయం అయ్యాను. అదీగాక మొన్న వెంకటేశ్‌బాబు కాంబినేషన్‌లో అబ్బాయిగారు చిత్రం కూడా సూపర్‌హిట్ అయ్యిందికదా. సెంటిమెంటల్‌గా నా ప్రెజన్స్ లక్‌గా ఫీలవుతారు నాయుడుగారు. నేను హక్కుగా ఫీలవుతాను కదండీ" అంటూ నవ్వేసింది

—సాయిరాం



పెరిగింది. స్కూల్లో వాలి సుగ్రీవులు ఒక జట్టుగా వుండేవారు. వేరే పిల్లలకు వాళ్లను తాకడానికి కూడా ధైర్యం వుండేదికాదు. ఆ అన్నదమ్ముల మధ్యన మంచి స్నేహం వుండేది. ఒకరికి జబ్బువస్తే రెండోవాడికి అదే జబ్బు వస్తుంది. లేక వచ్చినట్టు వుంటుంది. ఇద్దరూ ఒకే మంచంలోనే పడుకుంటారు. కానీ మంచి ఆరోగ్యంగల పిల్లలు కావడం మూలాన వాళ్లకు మామూలుగా జబ్బులేం రావు. ఎప్పుడైనా కొద్దిగా జలుబు, జ్వరం లేక విరేచనాలు వస్తే అది ఇద్దరికీ వర్తిస్తుంది.

ఇప్పుడు బల్లపై జరిగే యుద్ధాలు సెలవు దివాల్లో ఎక్కువగా జరిగేవి. ఏదైనా ఆటలు ఆడుకుందామని పిల్లలిద్దరూ బల్ల దగ్గరికి చేరుకునేవారు. బల్లచెక్క వాలిది. సుగ్రీవుడికి కావాలంటే బల్లకింద కూర్చోవాలి. ఒకవేళ సుగ్రీవుడు కుర్చీలో కూర్చున్నాడంటే అతని చేతులు కూడా బల్లపై పెట్టకూడదు. పిల్లలిద్దరూ కామిక్స్ చదువుకోడానికి కూడా ఈ విధంగానే కూర్చోవాలి. అంటే ఒకరు బల్లచెక్కపై కూర్చుని చదువుతాడు. ఇంకొకడు బల్లకింద కూర్చుని చదువుతాడు. అప్పుడప్పుడు వాళ్ల 'పోలీసు—దొంగ' ఆట ఆడతారు. వాలి ఎప్పుడూ పోలీసే. సుగ్రీవుడు ఎప్పుడూ దొంగే. సుగ్రీవుడు పోలీసు కావాలని పోట్లాడినా చివరికి విజయం సాధించేది వాలే. పోలీసువాడేకదా బల్లపై కూర్చునేది. దొంగ బల్ల కింద దాక్కుని వుండాలి. సుగ్రీవుడికి ఈ విషయంలో రోజూ సంకటం, ఏడుపూ వుండేది. ఏమైనా ఆ గది వదిలింతర్వాత వేరే గదిలోగానీ, ఇంటి బయటగాని వారు మంచి స్నేహితులు, అవిభాజ్య సహోదరులు.

ఆ రోజు ఆదివారం. వాలి, సుగ్రీవులు పోలీసు—దొంగ ఆట ఆడుతున్నారు. క్రింద కూర్చుని కూర్చుని విసిగిపోయిన సుగ్రీవుడు ఎక్కడినుండో ఒక పెద్ద మేకు, రాయి తీసుకొచ్చాడు. వాలి కూర్చున్న స్థానం క్రింద నుంచి అతను ఆ మేకును పైకి రాయితో కొట్టి కొట్టి ఎక్కించాడు. పైనుంచి ఏదో వస్తువుతోగాని, చేతులతోగాని వాలి కొట్టడం, క్రిందనుంచి సుగ్రీవుడు కొట్టడం వాళ్ల ఆటల్లో ఒక మామూలు భాగమే. అందుకే జరగబోతున్న అపాయం గురించి వాలికి ఎలాంటి అనుమానం కలగలేదు. మేకుపై రాయితో కొట్టిన చివరి దెబ్బ బాగా గట్టిగానే కొట్టాడు సుగ్రీవుడు. అది కనీసం ఒక అంగుళం వాలి పిర్రలోకి దిగిపోయింది. నొప్పితో గిజగిజలాడుతూ వాలి ఒక్క ఎగురు ఎగిరేటప్పుడు రక్తం కారడం మొదలయింది. రక్తం చూడగానే వాలి అరుపులు ద్విగుణీకృతమయ్యాయి. భయపడి బల్లకింద నుంచి బయటకు వచ్చిన సుగ్రీవుడు రుధిర ప్రవాహము చూసి గట్టిగా పెడబొబ్బలు పెట్టాడు. వాళ్లిద్దరి ఏడుపులు విని అంజమ్మ, హనుమంతరావులు పరుగెత్తుకొచ్చారు. వాళ్లు కూడా చాలా భయపడిపోయారు. ఏం జరిగిందో వాలికి అర్థంకాలేదు. జరిగిన విషయం సుగ్రీవుడే వారికి ఏడుస్తూ వివరించాడు. దుఃఖం, కోపం ఒకేసారి పొంగి వచ్చిన అంజమ్మ సుగ్రీవుడ్ని కొట్టడం మొదలుపెట్టింది. అంతలోపల కొంచెం ఐస్ తీసుకొచ్చిన హనుమంతరావు "చాలు ఇంక వాడ్ని కొట్టొద్దు. పాపం వాడేమైనా తెలిసి చేసాడా?" అని చెబుతూ ఆ ఐస్ ముక్కను కొంచెంసేపు ఆ గాయంమీద వుంచడంవల్ల ఆ రక్తస్రావం ఆగింది.

"కొట్టి ఎక్కించిన మేకు బాగా తుప్పు పట్టింది. అందుకే వెంటనే ఒక ఇంజెక్షన్ ఇప్పించాలి" అని హనుమంతరావు చెప్పాడు. ఆ తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలు డాక్టర్ దగ్గరకెళ్లి ఆ గాయానికి కట్టు కట్టించి ఒక ఆంటీ టెటనాస్ ఇంజెక్షన్ ఇప్పించి వాళ్లు తిరిగి ఇంటికి వచ్చారు. రెండురోజుల వరకు ఆ పిల్లలు బల్ల దగ్గరకు అసలుపోలేదు. వాళ్లకు భోజనం మంచంపైనే తినిపించారు. వాలికి ఈ దుర్గతి పట్టడంలో చాలా ఎక్కువ దుఃఖించింది సుగ్రీవుడే.

బల్ల గురించి జరిగిన వాలి సుగ్రీవుల కలహాల్లో వాళ్లిద్దరికీ రకరకాల శరీర క్షతాలు కలగడం జరిగిందికానీ ఈ కీల పర్వమే కీలకమైనది. వాళ్లిద్దరికీ వివిధరకాల క్షతాలు, దెబ్బలు ఏర్పడడం కాకుండా ఆ బల్ల చెక్కకు కూడా చాలా దెబ్బలు పైనుంచి, కిందనుంచి తగులుతూనే వుండేవి. మంచి పాలిష్ కలిగివున్న ఆ డైనింగ్ బల్ల ఈ రోజు వడ్రంగి 'పనిబల్ల' మాదిరి కనబడుతోంది.

ఆ సంఘటన జరిగి మూడునాలుగు రోజులు అయింది. ఆ అన్నదమ్ముల మధ్యన బల్లపై అధికారం అనే విషయంలో మరీ పోట్లాట మొదలయింది.

హనుమంతరావు ఓపిక కూడా నశించింది. అన్ని విషయాల్లో బాగా కలిసిమెలిసి వుంటున్న ఈ కవలపిల్లలు బల్ల విషయంలో మాత్రం ఎందుకు కలహిస్తున్నారు? మంచి తిండిగాని, ఆడుకునే వస్తువులపైగానీ వాళ్లెప్పుడు పోట్లాడరు. అన్ని వస్తువులు సమానంగా, సంతోషంగా వాళ్లు పంచుకుంటారు. అయితే ఈ బల్లకు మాత్రం ఏంటి ప్రత్యేకత? దీంట్లో పిశాచో, దయ్యమో ఏమైనా వుందా? ఈ బల్లచెక్క 'కలప'తో తయారయిందా? లేక 'కలహం'తో తయారయిందా? దీన్ని కోసి రెండు భాగాల చేసి తలా ఒక భాగమిస్తే పోట్లాట తగ్గుతుందా? లేకపోతే ఇలాంటి బల్లే వేరొకటి కొనిస్తే కాని అప్పుడు ఇద్దరూ ఆ కొత్త బల్లే కావాలని పోట్లాడుకుంటారేమో! ఈ బల్లను పూర్తిగా తీసేస్తే పాపం వాళ్ల పసి మనసులకు గాయం అవుతుందేమో!

పట్నంలో మంచి ఒక మనస్తత్వవేత్త దగ్గరకెళ్లి ఈ విషయం గురించి చర్చించాడు హనుమంతరావు. ఇంత చిన్న పిల్లల్ని, మానసిక రోగ చికిత్సకుడి దగ్గర




సగం

"ఏమిటి సార్ మీటరు 50 రూపాయలు అయితే 25 రూపాయలే ఇస్తున్నారు" అడిగాడు ఆటో డ్రైవర్.

"ఆటోలో నేనొక్కడ్నే తిరగలేదు గదయ్యా. నీవు తిరిగావు కాబట్టి సగం చార్జి, నీది, సగం నాది" చెప్పి దిగిపోయాడా వ్యక్తి"

—జీవి (నల్లగొండ)






## స్లాపుకాదు

టాప్‌హీరో స్లాపంటున్నారు ఒకప్రక్క. మరోప్రక్క జనం ఎగబడి చూస్తున్నారు. ఇదే ప్రస్తావన కృష్ణారెడ్డి దగ్గర తీసుకొస్తే ఎవరన్నారు స్లాపని. ప్రేక్షకుల ఎక్స్‌పెక్టేషన్‌ని రీచ్ కాలేకపోయిన మాట వాస్తవమేగానీ ఇట్సె హిట్ మూవీ అంటున్నారు. బాలకృష్ణ మాత్రం ఈ చిత్రం విషయంలో నోరు మెదపడంలేదు. బాగానే పోతుందని వార్తలందుతున్నాయి అని మాత్రం క్లీన్ సర్టిఫికెట్ ఇవ్వగలుగుతున్నాడు.

—సాయిరాం



తీసుకుపోవడం అవసరంలేదని ఆయన చెప్పాడు. పిల్లల్లో వున్న తుంటరితనానికిగాని, చిలిపితనానికిగాని ఒక మనోరోగం పేరు పెట్టడం సమంజసంకాదని అభిప్రాయపడ్డాడు. తరువాత కొంతసేపు దీర్ఘాలోచన చేసిన ఆ అతి ప్రజ్ఞావంతుడు ఒక మంచి సలహా ఇచ్చాడు.

"పెద్దవాడికి కావాల్సినది బల్లపైభాగం, చిన్నవాడు క్రింద కూర్చుని బల్లను ఏంచేసినా పైవాడికి అభ్యంతరం లేదు. అన్ని విషయాల్లో మంచి ఐక్యత వున్న ఈ కవల పిల్లల మధ్యన వున్న ఒకే ఒక అభిప్రాయ భిన్నత—ఈ బల్లపై భాగం గురించే. అందుకే ఆ బల్ల ఇంక మీ ఇంట్లో వుండకూడదు. కానీ ఒక డైనింగ్ టేబుల్ ఇంట్లో లేకుండా పోవడం, ఆ ఇంటిలో ఒక లోపం, మీకందరికీ అసౌకర్యం కూడా . అందుకే మీరు ఇంకొక బల్ల కొనుక్కోవాలి. కానీ పిల్లలకు దానిపైన ఎక్కాలని అనిపించకూడదు. అలాంటి ఒక బల్ల కొనండి. నా అభిప్రాయంలో ఒక గ్లాసు పైభాగంగల బల్లకొంటే దానిపైన ఎక్కకూడదని పిల్లలకి చెప్పి ఒప్పించడం అంత కష్టమేమీ కాదు. గాజుబల్లపై ఎక్కడానికి పిల్లలకు భయంగానే వుంటుంది. గాజు కావడంవల్ల అది పగిలిపోతుందేమోనని ఏ పిల్లలకయినా అనిపిస్తుంది"

"కానీ గాజు త్వరగా పగిలిపోతుందనే విషయం నిజమేకదా?" అని హన్మంతరావు అడిగాడు.

"గాజు పగిలే వస్తువే. కానీ ఈ రోజుల్లో మంచి బలమైన గాజు దొరుకుతుంది. ఎన్నో హోటళ్లలో, ఇళ్లల్లో ఇప్పుడు వాడుతున్నారు. కొంచెం జాగ్రత్తగా వుండాలి అంతే"

"పగిలిగాని, పగలకుండానేగాని ఆ గ్లాసు పిల్లల పైన పడితే?" అని ఆ వాత్సల్యంగల తండ్రి అడిగాడు.

"అలా ఏం జరగదు. మంచి బరువు మరియు బలంగల గ్లాసు దొరుకుతుంది. ఆ బల్ల కాళ్లు మంచి దిట్టమైన కర్రతో చేసి వుంటుంది. ఆ కాళ్లపైన జిగురుతో చాలా గట్టిగా అతికించి వుంటుంది. అందుకే అది క్రిందపడిపోయే సమస్యేలేదు. కానీ అలాంటి ఒక బల్లకు ధర చాలా ఎక్కువగా వుంటుంది. కానీ పిల్లల పొట్లాట ఆపడానికి ఇదే సరైన పద్ధతి. వాళ్లను ఒప్పించడం కూడా సులభము. వాళ్లిద్దరు ఇంక బుద్ధిమంతుల్లా కుర్చీల్లో కూర్చుని భోంచేస్తారు"

హన్మంతరావుకి ఆయన సలహా బాగా నచ్చింది. పిల్లల కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా వున్న ఆ తండ్రి ఆ రోజే ఒక ఖరీదైన డైనింగ్ టేబుల్ కొని పాత బల్ల స్థానంలో ప్రతిష్ఠించాడు. పాత బల్ల తీసుకుకపోయేటప్పుడు వాలి వైపు నుంచిగానీ ఎలాంటి ప్రతిషేధం రాలేదు. వాలి, సుగ్రీవుల వికసిత నేత్రాలు కొత్త బల్ల అనే అద్భుత వస్తువును పరిశీలిస్తున్నాయి. ఆ బల్లను అక్కడ సరిగ్గా అమర్చిన ఆ పనివాళ్లు బయటకు వెళ్లగానే ఆ ఇద్దరు పిల్లలు దాని చుట్టూ తిరిగి దానిపైన, క్రింద అంతా ఎంతో గర్వంగా వీక్షించారు. ఆ బల్లకింద సుగ్రీవుడు దూరడానికి ప్రయత్నిస్తే ఎంతో వాత్సల్యంతో హన్మంతరావు వాడి చెయ్యి పట్టుకుని లాగి—

"నాయనా సుగ్రీవా, బల్ల క్రిందకి పోకూడదు. నీ తల గాజుకు తగిలితే గాజు, తల రెండు పగులుతాయి. వాలీ నువ్వు కూడా దీనిపైకి ఎక్కకూడదు. ఎక్కితే ఈ గాజు పగిలిపోతుంది. ఆ రోజు మేకు గుచ్చుకున్నప్పుడు బాగా రక్తం వచ్చిందికదా! అలాగే ఈ గాజు పగిలి గుచ్చుకుంటే అంతకంటే ఎక్కువ రక్తం వస్తుంది"

తండ్రిగారి ముఖంలోకి తదేకంగా చూస్తూ నిలబడిన వాలి సుగ్రీవులు తిరిగి బల్లవైపు చూసి ఒక నిముషం ఆలోచించి కొద్దిగా తెరిచి వుంచిన నోటితో తమ చూపు మళ్లీ తండ్రి వైపు త్రిప్పి ఆయన చెప్పేది నిజమే అన్నట్లు కొంచెం తల పంకించారు. వాళ్ల కళ్లల్లో ఒక రకమైన భయం కనబడింది.

"ఒరే పిల్లలూ భయపడకండి. దానంతటదే పగిలిపోదు. కానీ మీరు దాన్ని పగులగొట్టకూడదు. ఈ కొత్త కుర్చీలు ఎంత అందంగా వున్నాయో చూడండి. దీనిపై కూర్చుని భోజనం బల్లపైన పెట్టుకుని తినాలి"

అంగీకార సూచకంగా తల వూపారు. తన భర్త ఎంతో తెలివిగా పిల్లల్ని ఒప్పించారని సూచించే విధంగా అంజమ్మ కూడా ప్రశంసాపూర్వకంగా తల వూపింది. డాక్టరు అభిప్రాయం చాలా ప్రయోజనకరంగా వుందని, ప్రాథమిక లక్షణాలు కనబడిన సంతోషంలో హన్మంతరావు కూడా అంజమ్మ మొహం చూసి తల వూపాడు.


ఇంకొక వ్యక్తి అప్పుడు అక్కడ వుండి వుంటే చాలా సంతోషంతో తల వూపేవాడు. కానీ అతను స్వగృహంలో కూర్చుని ఎప్పుడో వూపాడు తల.

అతను వేరే ఎవరోకాదు. మన మనస్తత్వవేత్తే. గాజు బల్ల కొనడం, సుగమం చేయడానికి ఆ డాక్టరే ఫర్నిచర్ షాపువాడికి ఫోన్ చేసాడు.

ఆ బల్లను అమ్మినవాడు, ఆ డాక్టర్ సిండికేట్ వున్న ఒకడని హన్మంతరావుకు తరువాత ఎప్పుడైనా తెలిసినా అతను ఆ డాక్టర్‌ను అపార్థం చేసుకోడు. తన చిన్నారి పిల్లలు వాలీ సుగ్రీవుల మధ్యన వున్న ఒకే ఒక "మాత్సర్యాన్ని" అతను ఎంత సులువుగా తీసేశాడు?

★

అడ్రస్:
ఎ.పి.బి.నాయర్, అయ్.పి.ఎస్
నెం.3, అమరజ్యోతి కాలనీ
బోయినపల్లి
సికిందరాబాద్–11




## మోసం

"నువ్వు ఎప్పుడు పేకాడినా గెలుస్తావ్. మరి గుర్రపందాలలో డబ్బు పోగొట్టుకుంటావ్. ఎందుకని?"

"మరి గుర్రాల్ని మోసం చేయలేము కదా!" చెప్పి నాలిక్కరచుకున్నాడు జితేంద్ర.

—పి.వి.రమణకుమార్
(చిలకలూరిపేట)





## దాసరి స్టయిల్

'మాయాబజార్' చిత్రం ప్రారంభం నుంచీ సెన్సేషనే. స్వర్గీయ కె.వి.రెడ్డిగారి చేత క్లాప్ కొట్టించి ఆహూతులను సైలెంట్ సర్‌ప్రైజ్ చేసారు. అక్కినేని పక్కన ఆరితేరిన తొమ్మండుగురు హీరోయిన్స్‌తో చలాకీ పాట పెట్టి మరో సెన్సేషన్ సృష్టించారు. యువనటుడు సుమన్, ఆమనిలకు ఫుల్ లెంత్ యాక్షన్ మాస్ అపీలింగ్ వైరైటీ పాత్రలు క్రియేట్ చేసి ఓహో అనిపించారు. అన్నిటినీ మించి తను దర్శకత్వం వహిస్తూ ఎస్‌వీఆర్‌ను తలపింపజేసే ఘటోత్కచుని పాత్రలో లీనమై నటించడం, సెట్‌లో సవ్యసాచిలా తన బాధ్యతలు నిర్వహించడం దాసరి స్టయిల్. —సాయిరాం

